క్లుప్తంగా

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలు (ఆయా) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ సముద్రవేణి ఒక ప్రకటనలో తెలిపారు. పడతడిక-1 బీసీ (సీ), పెన్నమ్మదిబ్బ బీసీ (ఎ), కాపుటూరు (ఓసీ), కృత్తివెన్ను పల్లెపాలెం -2 బీసీ (ఎ), యండపల్లి (ఓసీ), పెదగొల్లపాలెం (ఓసీ) కేంద్రాలలో సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా బంటుమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా
ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు



ఘంటసాల(అవనిగడ్డ): రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని కొడాలి మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాల పెదగూడెంకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు వేమూరి వెంకట్రావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వెంకట్రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏఎంసీ చైర్మన్‌గా నియమించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, పేరు సూచించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ వి. బాలశౌరి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త కడవకొల్లు నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, దిరిశం వెంకటలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తలగడదీవి(నాగాయలంక): విప్రో ఎర్తియన్ సైన్స్ ప్రాజెక్ట్ చేపట్టిన ఆన్‌లైన్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారని పాఠశాల హెచ్.ఎం అన్నపరెడ్డి రామారావు బుధవారం తెలిపారు. తానంకి సంయుక్త, పకారపు బాలవర్ధన్, కొల్లూరి అమృత, మండలి హేమశ్రీ, నీలా సాత్విక్ సంయుక్తంగా రూపొందించిన బయో డైవర్సిటీ ఈజ్ ద యూనిటీ ఆఫ్ లైఫ్ ప్రాజెక్ట్ ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి విజేతలుగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ప్రత్యేకంగా గైడ్ చేసిన టీచర్ కొమ్మినేని ఉదయకుమార్‌ను, విద్యార్థులను హెచ్‌ఎం రామారావు, సిబ్బంది అభినందించారు.

చిరస్మరణీయుడు కైకాల సత్యనారాయణ

మోపిదేవి: విలక్షణ నటుడు, మచిలీపట్నం మాజీ ఎంపీ కైకాల సత్యానారాయణ చిరస్మణీయులని పలువురు వక్తలు కొనియాడారు. సత్యనారాయణ సంస్మరణ కార్యక్రమం మోపి దేవి ప్రధాన సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. కోసూరు నాగమల్లేశ్వరరావు (స్వీట్‌షాపు) ఆధ్వర్యంలో అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా సంక్రాంతి ఆటల పోటీలు



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఆటలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తే జూదాలు భవిష్యత్‌ను నాశనం చేస్తాయని చెప్పారు. అనంతరం బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఆటలతోపాటు రంగవల్లుల పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ బి. వేదాంతం పాల్గొన్నారు.

ఆహారం ప్యాకెట్లు పంపిణీ

పామర్రు: నిరుపేదలైన వారికి దాతలు ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం వద్ద దాత సహకారంతో నిరుపేదలకు ఆహారపు పొట్లాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్థానికులు నందిపాటి రవిశంకర్ రెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె శర్మిక ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగంలో స్థిర పడిన సందర్భంగా వారి సౌజన్యంతో 50 మంది నిరుపేదలకు ఆహారపు పొట్లాలను పంపిణీ చేశామన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్ద పీట

రూ. 21.60 లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన



పీఏసీఎస్ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): రైతుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంకలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణానికి రూ. 21.60 లక్షలతో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇటీవల వచ్చిన వరదలు, వర్షాలకు తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొల్లాటి రాము కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శించారు. సర్పంచ్‌లు చింతా శ్రీనివాసరావు, కొలసాని వెంకట కృష్ణ, గరికిపాటి వెంకటేశ్వరావు(బుల్లి), పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు రెడ్రౌతు వెంకట రమణ, అరజా లక్ష్మీ తులసీ, ఆది రాంబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు రావి రామప్రసాద్, గరికిపాటి గోవిందరాజులు పాల్గొన్నారు.

పేదల కోసం విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు

మోపిదేవి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అందుబాటులో ఉండేటా విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తునానమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మోపిదేవి సచివాలయం-1లో వెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరావు(బుల్లి), పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మండలంలో 155 కొత్త పింఛన్ల పంపిణీ



అవనిగడ్డలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు



మచిలీపట్నం ఆస్పత్రిలో రమేష్‌కు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ దాక్షాయణి

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. 155 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లను మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పింఛన్ ఇవ్వాలంటే ఎవరన్నా చనిపోతే వారి స్థానంలో అది కూడా జన్మభూమి కమిటీలు ఆమోదం తెలిపితేనే ఇచ్చేవారని చెప్పారు. నేడు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు 39 లక్షల మందికి పింఛన్లు ఇస్తే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 64.06 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని వివరించారు. ఇవన్నీ ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకి కనబడవని ఎంతసేపూ విమర్శలు చేయడమే వారిపని అని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాలన్నింటినీ గ్రహిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గౌరుముచ్చు ఉమా, దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీ గోళ్ల కృష్ణకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మచిలీపట్నం వెళ్లి పింఛను అందజేత

పెడన: పెడన 22వ వార్డుకు చెందిన కొక్కు రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమై మచిలీపట్నం పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ బూసం దాక్షాయణి ఆస్పత్రికి వెళ్లి రమేష్‌కు వృద్ధాప్య పింఛను నగదు అందజేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

- కృత్తివెన్ను: పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చినగొల్లపాలెం పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 167 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని, వీటితో కలిపి మొత్తం 7,019 మందికి పింఛన్లు అందజేస్తునానమని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. ఎంపీపీ గరుడప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సునీల్, ఎంపీటీసీ లక్ష్మణుడు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పింఛను మంజూరు

అవనిగడ్డ: పులిగడ్డకు చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ చెన్ను గాంధీకి నూతన పింఛన్ మంజూరైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో పింఛన్ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందజేశారు.

- బంటుమిల్లి: మండలంలో మంజూరైన 211 కొత్త పింఛన్లను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎంపీపీ వి. చినబాబు అందజేశారు. ఎంపీడీఓ కె. స్వర్ణభారతి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ పాత పించన్‌దారులతోపాటు కొత్తగా మంజూరైన లబ్ధిదారుల గృహాల్లో కొత్త సంవత్సరంలో సంక్రాంతి సంబురాలు ముందుగా జరుపుకునే భాగ్యాన్ని జగనన్న కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్, వైస్ చైర్మన్ పి. బాబూరావు, మండల ఉపాధ్యక్షుడు ఓ. చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- గూడూరు: అవ్వాతాతల ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని లేళ్లగరువు పీఏసీఎస్ చైర్మన్ రాయపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. లేళ్లగరువులో నూతనంగా మంజూరైన సామాజిక పెన్షన్లను వైఎస్సార్ సీపీ నాయకులు నరహరిశెట్టి ధనేష్‌తో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందుకుంటున్న అన్ని వర్గాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అజయ్, వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో 98.64 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సామాజిక పింఛన్ల పంపిణీ నాలుగో రోజైన బుధవారం 98.64 శాతం మేర పూర్తయ్యింది. నగరంలో 18,690 పింఛన్లు ఉండగా 18,435 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 255 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. పింఛన్ల పంపిణీలో జిల్లాలో మచిలీపట్నం నగర పాలక సంస్థ నాలుగో స్థానంలో నిలిచింది.

సమస్యలు తెలుసుకునేందుకే మీ ముందుకు వస్తున్నాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



స్థానికులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

అవనిగడ్డ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని వీవర్స్‌కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటకే సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మేలు జరిగితేనే ఆదరించమని దమ్ముగా చెప్పిన సీఎం జగనన్న లాంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎవరూ లేరన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు సామర్ల రాముడు, ఉప సర్పంచ్ గాజుల జయగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

మచిలీపట్నంటౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 36వ డివిజన్‌లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్‌లతో కలిసి ఆయన రాజుపేట మగ్గాల కాలనీ ప్రాంతంలో గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, డివిజన్ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, పార్టీ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ఎగ్గోని గాంధీ, నాయకులు పురంశెట్టి శ్రీనివాసరావు, చింతపట్ల నాని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలస్యమైనా పని చేద్దామని వెళ్లి..

రెండు కుటుంబాల్లో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

చల్లపల్లి: జాతీయ రహదారిపై జీలగలగండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాదంలో మృతిచెందిన షేక్ షరీఫుద్దీన్ (బుజ్జి), మార్గాని శివ కోటేశ్వరరావు (కోటి) మృతదేహాలు పోస్టుమార్టం అనంతరం బుధవారం గ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

షరీఫుద్దీనే పెద్ద దిక్కు..

మృతుల్లో చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన అబ్దుల్ షరీఫుద్దీన్‌పై తల్లి, భార్య, పిల్లలు, ఇద్దరు సోదరులు ఆధారపడి ఉన్నారు. షరీఫుద్దీన్ అన్న కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటికి పరిమితం కాగా తమ్ముడు కిడ్నీ సమస్యతో బాధపడుతూ పని చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో వీరందరికీ పెద్ద దిక్కుగా ఉన్న షరీఫుద్దీన్ మృతిచెందడంతో వారి కుటుంబం దిక్కు తోచని స్థితికి చేరింది. మరొక మృతుడు మార్గాని శివ కోటేశ్వరరావు రెండేళ్ల కిందట వివాహం చేసుకుని రామానగరంలో ఉంటూ తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. కోటేశ్వరరావు మృతదేహాన్ని స్వగ్రామమైన చల్లపల్లి గౌడపాలెంకు చెందిన సంపతరావు ఇంటివద్ద నుంచి అంత్యక్రియలకు తరలించారు. కలిదిండి మండలం కొరగంటిపాలెంలో తాపీ పనికి బయలుదేరిన షరీఫుద్దీన్, శివ కోటేశ్వరరావులను ఆలస్యమైందని, రేపు వెళ్లవచ్చని మేస్త్రి చెప్పినప్పటికీ, షరీఫుద్దీన్ పని మానుకోవటం ఎందుకు? ఒక గంట అదనంగా చేసి వస్తామని చెప్పి బయలుదేరి వెళ్లి తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురికావడంపై కుటుంబ సభ్యులు, తోటి తాపీ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. షరీఫుద్దీన్, కోటేశ్వరరావు మృతదేహాలను పెద్ద సంఖ్యలో ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, టాపీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

అంధులకు అక్షరజ్ఞానం ప్రసాదించిన బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం పుష్పలత

గూడూరు: అంధులందరికీ అక్షర జ్ఞానం ప్రసాదించిన లూయిస్ బ్రెయిలీ దినోత్సవాన్ని గూడూరులోని నాన్-భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి గూడూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత పూలమాల వేసి నివాళులర్పించారు. అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అతను రూపొందించిన లిపి కారణంగా అనేకమంది అంధులు విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, కళాకారులుగా అనేక రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయరాణి, వి.వెంకటేశ్వరరావు, ఐఈఆర్‌పీ పి.రమాదేవి, పి.ఉమాపార్వతి తదితరులు పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: మండలంలోని నీలిపూడి నాన్ భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బ్రెయిలీ జీవితాన్ని విద్యార్థులకు వివరించారు. అంధత్వంతో బాధపడే వారికి మంచి విజ్ఞానాన్ని ఎలా పొందాలో దారి చూపిన బ్రెయిలీ ఘనతను వారికి తెలిపారు. దివ్యాంగ చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. హెచ్‌ఎం భారతి, వరలక్ష్మీ, ఫిజియో థెరపిస్టు హుస్సేన్, సూర్యనారాయణ, తంబిబాబు పాల్గొన్నారు.

రేపు ఉచిత పశు వైద్య శిబిరం

నాగాయలంక: మండల పశు వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం మర్రిపాలెం గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి రోడ్డు రావిచెట్టు సెంటర్‌లో శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. పశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పెన్షనర్ల సాయం



సాయం అందజేస్తున్న పింఛనుదారులు, పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌లోని సామాజిక పింఛనుదారులు తోటి పింఛనుదారుని కుటుంబానికి ఆసరాగా నిలిచారు. డివిజన్‌లోని సామాజిక పింఛనుదారుడు తటవర్తి నారాయణరావు ఈ నెల 2వ తేదీన మృతిచెందాడు. డివిజన్‌లోని పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ. 37 వేలను కార్పొరేటర్ షేక్ షాహీనా, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ చేతుల మీదుగా నారాయణరావు భార్య ధనలక్ష్మీకి బుధవారం పింఛనుదారులు అందజేశారు. నారాయణరావు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు నజాఫ్ అలీ తదితరులు పరామర్శించారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

కోనేరుసెంటర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (కిట్టు) తెలిపారు. బందరు మండలం హుస్సేన్‌పాలెంలో రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, గ్రామ ఇన్‌చార్జ్ చండిక అజయ్, పీఏసీఎస్ అధ్యక్షుడు సాక్షి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తాచాటిన మల్లవోలు విద్యార్థులు



విద్యార్థులను, గైడ్ చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న హెచ్‌ఎం పాండురంగారావు

గూడూరు: విప్రో సంస్థ నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టు పోటీల్లో గూడూరు మండలం మల్లవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఎ డ్రాప్ హార్వెస్టెడ్ ఈజ్ ఎ క్రాప్ హార్వెస్టెడ్ అనే వాటర్ ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల స్థాయిలో మొదటి స్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పాండురంగారావు తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్.అరుణ, కె.శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో విద్యార్థులు కె.నాగరమ్య జయశ్రీ, కె.చాందిని, సీహెచ్.ప్రియాంక, డి.నాగశివరామ్, పి.సంతోష్ భాగ్యశ్రీలు ప్రాజెక్టు రూపొందించారని చెప్పారు. విద్యార్థులను, గైడ్ చేసిన ఉపాధ్యాయులను సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, విద్యా కమిటీ చైర్మన్ పి.నరసింహారావు అభినందించారు.

ఆక్వా జోన్ రీ సర్వేకు సహకరించాలి
ఎఫ్‌డీఓ సత్యనారాయణ

కోడూరు: ప్రభుత్వ ఆదేశాలతో చేపట్టిన ఆక్వా జోన్ రీసర్వేకు రైతులందరూ సహకరించాలని మత్స్యశాఖ ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేకు సంబంధించి వ్యవసాయ, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆక్వా జోన్ పరిధిలోని రొయ్యలు, చేపల చెరువులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని, ఇందులో భాగంగా చెరువులను గుర్తించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నామని ఎఫ్‌డీఓ చెప్పారు. ప్రస్తుతం సాగు చేస్తున్న చెరువులతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడని భూములను కూడా చెరువులుగా మార్చేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు వీటిని కూడా ఆక్వా జోన్‌లో చేర్చేందుకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నారని చెప్పారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ కమిటీలు, అధికారులు ఆయా మండలాల్లో పర్యటించినప్పుడు రైతులు తమ భూముల వివరాలను తెలిపి సహకరించాలని కోరారు. ఇన్‌చార్జి డీటీ సరళ, వీఎఫ్ఏలు, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మినప సాగులో మెలకువలు పాటించాలి



మినప పంటను పరిశీలిస్తున్న అధికారులు

గూడూరు: మినప పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతి రమణి అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగవుతున్న మినప పంటను బుధవారం ఆమె పరిశీలించారు. పంటకు పల్లాకు తెగులు, లద్దె పురుగు, తామర పురుగు, బంగారు తీగల ప్రభావం ఉన్నట్లు ఆమె గుర్తించారు. వాటిని అధిగమించేందుకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. ఎటువంటి రసం పీల్చే పురుగులు గానీ, లద్దె పురుగులు గానీ మారుక మచ్చల పురుగులు గానీ పంటకు ఆశించకుండా ఉండాలంటే ముందస్తుగానే వేప నూనె పిచికారీ చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటిస్తూ పరిమిత స్థాయిలో రసాయనాలు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బందరు ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓ బి.పద్మజ, ఆర్బీకే చైర్మన్ ఏవీవీ నాగేశ్వరరావు, వీఏఏ టి.బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: గ్రామ స్థాయిలో వ్యవసాయ రంగానికి తోడుగా మహిళలు ఇతర వ్యాపారాల ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీపీ వి. చినబాబు అన్నారు. బుధవారం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఔత్సాహిక మహిళలకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్ ప్రెన్యూర్ (పీఎంఎఫ్ఎంఈ) పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పథకం నియమ, నిబంధనలను వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు వివరించారు. రూ. 3 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు పలు రకాల యూనిట్లు 35 శాతం రాయితీపై ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, ఎంపీడీఓ కె. స్వర్ణభారతి, కో-ఆప్షన్ సభ్యుడు హలీం, ఏసీ కనకారావు, ఏపీఎం డి. శ్రీను, డీఆర్పీలు రాజగోపిందం, రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తోట్లవల్లూరు: టెన్త్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని పెనమకూరు సర్పంచ్ నందేటి గంగాభవాని అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఆమె విద్యార్థులకు పంపిణీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందును విద్యార్థులు బాగా చదువుకోవాలని గంగాభవాని పేర్కొన్నారు. ఎంపీటీసీ మరీదు వెంకటశివ మధుబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.